www.prajasakti.com

ప్రజాశక్తి

సోమవారం 3 మార్చి 2025 | 5 | ఏలూరు



సాయిపల్లవికి జాతీయ స్థాయి అవార్డు

ప్రజాశక్తి - ముదినేపల్లి

ముదినేపల్లిలోని ఇండో సాక్సన్ ఇంగ్లీష్ మీడియం హై స్కూల్‌లో మూడో తరగతి చదువుతున్న విద్యార్థిని కాగిత సాయి పల్లవి హైదరాబాద్‌లో విశ్వం ఎడ్యుటెక్ నిర్వహించిన జాతీయ స్థాయి స్పెల్ బీ పోటీల్లో రైజింగ్ స్టార్ అవార్డ్ కైవసం చేసుకుంది. మండలంలోని వడాలి గ్రామానికి చెందిన కాగిత సాయి పల్లవి పాఠశాల, జిల్లా, రాష్ట్ర స్థాయిల్లో జరిగిన పోటీల్లో టాపర్‌గా నిలిచి జాతీయ స్థాయికి చేరుకుంది. ఆదివారం హైదరాబాద్‌లో నిర్వహించిన పోటీల్లో వివిధ రాష్ట్రాల విద్యార్థులతో పోటీ పడి విజయాన్ని సాధించింది. ఈ సందర్భంగా జాతీయస్థాయి అవార్డు కైవసం చేసుకున్న కాగిత సాయి పల్లవిని పాఠశాల ప్రిన్సిపల్ సాలీ జార్జ్, ఉపాధ్యాయులు అభినందించారు.



అవార్డు అందుకుంటున్న సాయిపల్లవి

నేడు పట్టభద్రుల తీర్పు

ఉదయం 8 గంటలకు ఎంఎల్‌సి ఎన్నికల కౌంటింగ్
బరిలో 35 మంది అభ్యర్థులు, మొత్తం పోలైన ఓట్లు 2,18,902
మొదటి ప్రాధాన్యతా ఓటులో 50 శాతం మార్క్‌దాటితే విజేతనే
మార్క్ దాటకపోతే ఎలిమినేషన్ రౌండ్‌కు వెళ్లాల్సిందే
ఫలితం వెల్లడికి సమయం పట్టే అవకాశం
టిడిపి, పిడిఎఫ్ అభ్యర్థుల మధ్యే గట్టి పోటీ

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

తూర్పు, పశ్చిమగోదావరి జిల్లాల పట్టభద్రుల ఎంఎల్‌సి ఎన్నికల కౌంటింగ్ సోమవారం ఉదయం ఎనిమిది గంటలకు ప్రారంభం కానుంది. పట్టభద్రుల ఓటర్లు తీర్పు ఎటువైపు అన్న ఉత్కంఠ కొనసాగుతోంది. నెల రోజులకుపైగా జరిగిన ఎన్నికల తంతు సోమవారంతో తెరపడనుంది. పట్టభద్రుల ఎంఎల్‌సి ఎన్నికల్లో విజేత ఎవరో తేలిపోనుంది. జనవరి 29న ఉభయగోదావరి జిల్లాల పట్టభద్రులు ఎంఎల్‌సి ఎన్నికలకు కేంద్ర ఎన్నికల సంఘం షెడ్యూల్ విడుదల చేసింది. ఫిబ్రవరి మూడో తేదీన ఎంఎల్‌సి ఎన్నికల రిటర్నింగ్ అధికారి కలెక్టర్ వెట్రిసెల్వి నోటిఫికేష్ జారీచేశారు. ఆ రోజు నుంచి ఫిబ్రవరి పదో తేదీ వరకూ నామినేషన్ల ప్రక్రియ కొనసాగింది. 13వ తేదీన విత్‌డ్రాల పర్వం ముగిసేరికి ఎన్నికలో 35 మంది అభ్యర్థులు నిలిచారు. రెండు ఉమ్మడి జిల్లాల్లో మొత్తం 3,14,984 పట్టభద్రుల ఓటర్లు ఉన్నారు. ఫిబ్రవరి 27వ తేదీన ఎంఎల్‌సి ఎన్నికల పోలింగ్ జరిగింది. ఓటింగ్‌లో మొత్తం 2,18,902 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. సోమవారం ఓట్ల లెక్కింపు ప్రక్రియ జరగనుండడంతో తుది తీర్పు కోసం అభ్యర్థులంతా ఉత్కంఠతో ఎదురుచూస్తున్నారు. ఉదయం ఎమినిది గంటలకు ఓట్ల లెక్కింపు ప్రారంభం కానుంది. ముందుగా బ్యాలెట్ బాక్సుల్లో ఓట్లను కట్టలుగా కడతారు. తర్వాత చెల్లని ఓట్లను తొలగిస్తారు. ఎంఎల్‌సి ఎన్నికల్లో ప్రాధాన్యత అంకెల క్రమంలో ఓటింగ్ జరగడంతో లెక్కింపునకు సమయం ఎక్కువ పట్టనుంది. చెల్లుబాటు అయిన ఓట్లలో మొదటి ప్రాధాన్యత ఓటుతో 50 శాతం మార్క్ దాటిన అభ్యర్థిని విజేతగా ప్రకటిస్తారు. ఒక వేళ ఏ అభ్యర్థికీ మొదటి ప్రాధాన్యత ఓటులో 50 శాతం మార్క్ దాటకపోతే ఎలిమినేషన్ రౌండ్ అనివార్యంగా మారుతోంది. రెండో ప్రాధాన్యతా ఓట్లను లెక్కిస్తూ ఎలిమినేషన్ ప్రక్రియ సాగుతోంది. సోమవారం సాయంత్రానికి కట్టలు కట్టడం పూర్తవుతుందని, మంగళవారం ఉదయానికి ఫలితంపై స్పష్టత వచ్చే అవకాశం ఉంటుందని అంచనా వేస్తున్నారు. ఓట్ల లెక్కింపులో మూడు షిఫ్టులుగా పని చేసేందుకు 700 మంది సిబ్బందిని నియమించారు. భారీ పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేసిన పరిస్థితి నెలకొంది.



ఓట్ల లెక్కింపునకు ఏర్పాట్లు

టిడిపి, పిడిఎఫ్ నాయకుల్లో ఉత్కంఠ

ఫిబ్రవరి 27న జరిగిన పట్టభద్రుల ఎంఎల్‌సి ఎన్నికల్లో టిడిపి అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖరం, పిడిఎఫ్ అభ్యర్థి డివి రాఘవులు మధ్యనే ప్రధాన పోటీ నెలకొంది. ఎన్నికల బరిలో ఇరువురు నువ్వానేనా అన్నట్లు పోటీపడ్డారు. కూటమి పార్టీల నేతల నుంచి సిఎం, డిప్యూటీ సిఎం వరకూ అంతా టిడిపి అభ్యర్థి తరపున ప్రచారం నిర్వహించారు. ఉద్యోగులు, నిరుద్యోగులు, పలు ప్రజాసంఘాలు పిడిఎఫ్ అభ్యర్థి డివి రాఘవులు తరపున ప్రచారం నిర్వహించారు. పోలింగ్ రోజు అధికార పార్టీ నేతలు నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించారన్న విమర్శలు వెల్లువెత్తాయి. పలుచోట్ల అధికార పార్టీ నాయకులు పోలింగ్ కేంద్రాల వద్ద డబ్బులు పంపిణీ చేయడం, దొంగ ఓట్లు వేశారంటూ ఆరోపణలు వెల్లువెత్తాయి. పోలీసులు, అధికారులు అధికార పార్టీకి వత్తాసు పలికారన్న విమర్శలు వెల్లువెత్తాయి. దీంతో గెలుపుపై తీవ్ర ఉత్కంఠ నెలకొంది. పట్టభద్రులు ఎవరివైపు నిలబడ్డారో కొద్ది గంటల్లో తేలిపోనుంది. ఏదిఏమైనా ఎంఎల్‌సి ఎన్నికల్లో అధికార పార్టీ వ్యవహరించిన తీరు మాత్రం సర్వత్రా చర్చనీయాంశంగా మారింది.

కౌంటింగ్ ప్రక్రియ ప్రారంభం : ఉదయం 8గంటలకు
బరిలో ఉన్న అభ్యర్థులు : 35 మంది
మొత్తం ఓటర్లు : 3,14,984 మంది
పోలైన ఓట్లు : 2,18,902
కౌంటింగ్ టేబుల్స్ : 28
రౌండ్లు : 17
కౌంటింగ్‌లో పాల్గొనే సిబ్బంది : 700 మంది

ఓట్ల లెక్కింపులో అప్రమత్తంగా ఉండాలి

రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ కె.వెట్రిసెల్వి

ప్రజాశక్తి - ఏలూరు

ఉమ్మడి తూర్పు, పశ్చిమగోదావరి జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గ ఎంఎల్‌సి ఎన్నికల ఓట్ల లెక్కింపు ప్రక్రియను అత్యంత అప్రమత్తతతో నిర్వహించాలని రిటర్నింగ్ అధికారి, జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి కౌంటింగ్ విధులు కేటాయించిన ఉద్యోగులు, పర్యవేక్షణ అధికారులను ఆదేశించారు. ఆదివారం కలెక్టరేట్ క్యాంపు కార్యాలయం నుంచి ఎంఎల్‌సి ఎన్నికల కౌంటింగ్ కేంద్రంలో విధులు కేటాయించిన ఓట్ల లెక్కింపు సిబ్బంది, టేబుల్ సూపర్ వైజర్లు, రోల్ ఇన్‌ఛార్జిలు, పర్యవేక్షణ అధికారులతో జూమ్ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ వెట్రిసెల్వి మాట్లాడుతూ ఎంఎల్‌సి ఎన్నికల బ్యాలెట్ పేపర్ లెక్కింపులో పూర్తి ఏకాగ్రతతో కౌంటింగ్ సిబ్బంది విధులు నిర్వహించాలన్నారు. బ్యాలెట్ బాక్సులు తెరిచే సమయంలో, బండ్లింగ్ చేయడం, లెక్కించే ప్రక్రియల నిర్వహణలో ఎన్నికల కమిషన్ నిర్దేశించిన మార్గదర్శకాలు కచ్చితంగా పాటించాలన్నారు. ఈ ఎన్నికలు బ్యాలెట్ పేపర్, మొదటి ప్రాధాన్యతా ఓటు, నమోదు విధానం ద్వారా జరుగుతున్న నేపథ్యంలో ఓట్ల లెక్కింపు చాలా జాగ్రత్తగా చేపట్టాలన్నారు. ఓట్ల లెక్కింపునకు సంబంధించి 456 పోలింగ్ బూత్‌ల నుంచి వచ్చిన బ్యాలెట్ బాక్సుల్లో ఉన్న ఓట్ల లెక్కింపునకు 28 టేబుళ్లు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ప్రతి టేబుల్‌కూ కౌంటింగ్ సిబ్బందితో పాటు టేబుల్ సూపర్‌వైజర్, రోల్ ఇన్‌ఛార్జి, షిఫ్టు ఇన్‌ఛార్జులతోపాటు మైక్రో అబ్జర్వర్లను నియమించడం జరిగిందన్నారు. కౌంటింగ్ కేంద్రంలో ఓట్ల లెక్కింపు సమయంలో పాటించాల్సిన నిబంధనలు, అనుసరించాల్సిన విధానాలపై ఇప్పటికే శిక్షణాతరగతులు నిర్వహించు కున్నామని, దానికి అనుగుణంగా విధులు నిర్వర్తించాలని తెలిపారు. ఈ నెల 3వ తేదీన ఏలూరు సర్ సిఆర్ రెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో నిర్వహించే ఓట్ల లెక్కింపు విధులకు షిఫ్టుల వారీ 700 మంది సిబ్బందిని నియమించామని సోమవారం ఉదయం షిఫ్టుకు కేటాయించిన సిబ్బంది ఉదయం 6.30 గంటల కచ్చితంగా హాజరు కావాలని ఆమె ఆదేశించారు.



మాట్లాడుతున్న కలెక్టర్ వెట్రిసెల్వి

ఉద్యాన పంటల్లో..
నాణ్యమైన దిగుబడికి సహకారం

జిల్లా ఉద్యాన అధికారి ఎస్.రామ్మోహన్

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

జిల్లాలో ఉద్యాన పంటల విస్తీర్ణం పెంచి నాణ్యమైన దిగుబడులు సాధించడానికి రైతులకు అన్ని రకాలుగా సహాయ సహకారాలు అందిస్తున్నట్లు జిల్లా ఉద్యాన అధికారి ఎస్.రామ్మోహన్ తెలిపారు. జిల్లాలో ఎన్ని ఎకరాల్లో ఉద్యాన పంటలు సాగు జరుగుతోంది, ప్రభుత్వం నుంచి ఎలాంటి రాయితీలు ఇస్తున్నారు, వాణిజ్య పంటల సాగు ఎలా ఉంది, పంటలు నిల్వ ఉంచడానికి గిడ్డంగుల ఏర్పాటుకు రైతులు ముందుకు వస్తున్నారా? వంటి ప్రశ్నలకు ప్రజాశక్తి జరిపిన ముఖాముఖిలో ఆయన సమాధానాలు ఇచ్చారు.





ప్రశ్న : ఉద్యాన శాఖ ముఖ్యోద్దేశం, లక్ష్యం ఏంటి?

జిల్లాలో ఉద్యాన పంటల విస్తీర్ణం పెంచడం, నాణ్యమైన దిగుబడులు సాధించడం, కోత తర్వాత నష్టాలు తగ్గించడం, మార్కెటింగ్ బాగున్న పంటలను ప్రోత్సహించడం వంటివి ఉద్యాన శాఖ ముఖ్య లక్ష్యాలు.

ప్రశ్న : ఏయే పంటలు ఉద్యాన శాఖ పరిధిలోకి వస్తాయి?

పండ్లు, కూరగాయలు, పూలు, వాణిజ్య పంటలు, ఔషధ, సుగంధ మొక్కలు ఉద్యాన శాఖ పరిధిలోకి వస్తాయి.

ప్రశ్న : జిల్లాలో ఎంత విస్తీర్ణంలో ఉద్యాన పంటల సాగు జరుగుతోంది? ఏయే పంటల సాగు ఎక్కువగా జరుగుతుంది?

జిల్లాలోని మొత్తం 27 మండలాల్లో ఉద్యాన పంటల సాగు 22 మండలాల్లో జరుగుతోంది. ముఖ్యంగా మెట్టలో 14 మండలాల్లో అధికంగా 2 లక్షల 76 వేల ఎకరాల్లో ఈ ఉద్యాన పంటల సాగు జరుగుతోంది. ముఖ్యంగా వాణిజ్య పంటలైన ఆయిల్ పామ్, కోకో, కొబ్బరి, జీడిమామిడి, నిమ్మ, అరటి, జామ వంటి పంటల సాగు ఎక్కువగా జరుగుతోంది. ఆయిల్ పామ్, కోకో దిగుబడిలో మన జిల్లా దేశంలోనే ప్రథమ స్థానంలో ఉంది.

ప్రశ్న: జిల్లాలో ఏయే పంటలు ఎంత విస్తీర్ణంలో సాగవుతున్నాయి?

జిల్లాలో ఆయిల్ పామ్ లక్షా 40 వేల ఎకరాల్లో, కోకో 36 వేల ఎకరాల్లో, కొబ్బరి 34 వేల ఎకరాల్లో, జీడిమామిడి 14,500 ఎకరాల్లో, నిమ్మ 7,500 ఎకరాల్లో, జామ 1,450 ఎకరాల్లో, కాయగూరలు 1,800 ఎకరాల్లో సాగవుతోంది.

ప్రశ్న: ఏయే ప్రాంతాల్లో వాణిజ్య పంటల సాగు ఎక్కువగా జరుగుతోంది?

ముఖ్యంగా వాణిజ్య పంటల సాగు టి.నర్సాపురం, చింతలపూడి, కామవరపుకోట, జంగారెడ్డిగూడెం, కొయ్యలగూడెం, లింగపాలెం, పెదవేగి, ద్వారకాతిరుమల మండలాల్లో ఎక్కువగా జరుగుతోంది.

ప్రశ్న: జిల్లాలో పూలసాగు ఎన్ని ఎకరాల్లో, ఏయే ప్రాంతాల్లో ఎక్కువగా జరుగుతోంది? ఏయే రకాలు పండిస్తున్నారు?

జిల్లాలో బంతి, చామంతి, కనకాంబరం, గులాబీ పంటల సాగు 300 ఎకరాల్లో జరుగుతోంది. ద్వారకాతిరుమల, పెదవేగి, జంగారెడ్డిగూడెం, కామవరపుకోట, ఏలూరు రూరల్ మండలాల్లో ఈ పూల సాగు జరుగుతోంది.

ప్రశ్న : కూరగాయల సాగు ఏయే ప్రాంతాల్లో జరుగుతోంది?

ముసునూరు, లింగపాలెం, పెదవేగి, ద్వారకాతిరుమల, కొయ్యలగూడెం, బుట్టాయగూడెం మండలాల్లో కూరగాయల సాగు జరుగుతోంది.

ప్రశ్న : ప్రభుత్వం నుంచి ఉద్యాన శాఖ ద్వారా రైతులకు ఎలాంటి సబ్సిడీలు అందిస్తున్నారు?

ఆయిల్ పామ్‌కు హెక్టారుకు రూ.71 వేల చొప్పున, కోకో పంటకు రూ.20 వేలు చొప్పున సబ్సిడీ అందించడం జరుగుతుంది. అలాగే మొక్కల ఎరువుల కోసం 50 శాతం రాయితీ ఇస్తున్నాం. పంట కోత తర్వాత నిల్వ ఉంచడానికి గిడ్డంగుల నిర్మాణం కోసం 50 శాతం, గరిష్టంగా రూ.రెండు లక్షల సబ్సిడీ, కలెక్షన్స్ సెంటర్లకు 40X60 అడుగుల షెడ్డు నిర్మాణానికి 40శాతం, గరిష్టంగా ఆరు రూ.లక్షల రాయితీ, నీటి నిల్వ కుంటలకు 20X40 మీటర్ల కొలతలతో మూడు మీటర్ల లోతుకు 75 వేల రూపాయల వరకూ సబ్సిడీ ఇవ్వడం జరుగుతోంది.

ప్రశ్న : ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లకు ఉద్యాన శాఖ ద్వారా ప్రోత్సాహకాలు ఉన్నాయా?

ఎవరైనా చాక్లెట్ జీడి గింజల ప్రాసెసింగ్ యూనిట్లు పెట్టడానికి ముందుకొస్తే రూ.పది లక్షల వరకు 35 శాతం రాయితీ ఇవ్వడం జరుగుతుంది. ఇందులో ఎస్‌సి, ఎస్‌టి మహిళలకు ప్రాధాన్యత ఇస్తున్నాం. అలాగే మ్యాంగో జెల్లి, జ్యూస్‌లు, కారంపొడి, మసాల పొడులు, పచ్చళ్లు, జామ్, పాప్ కార్న్ వంటి యూనిట్లకు రూ.10 లక్షల వరకూ 35 శాతం రాయితీ ఇవ్వడం జరుగుతుంది.

ప్రశ్న : జిల్లాలో ఈ ఆర్థిక సంవత్సరంలో మొత్తం ఎన్ని యూనిట్లు మంజూరు చేశారు?

ఈ ఆర్థిక సంవత్సరంలో మొత్తం 60 యూనిట్లు మంజూరు చేయనున్నాం. 14 నిల్వ గిడ్డంగులు, ఆరు కలెక్షన్స్ సెంటర్లు, నాలుగు నీటి కుంటలు ఇప్పటికే ప్రారంభించాం. వివిధ పథకాల ద్వారా 30 కోట్ల రూపాయలు 20 వేల మంది రైతులకు సబ్సిడీ ఇచ్చాం.

ప్రశ్న : జిల్లాలో పుట్టగొడుగుల సాగు ఎక్కడ జరుగుతోంది?

జిల్లాలో బొర్రంపాలెం, ఆగిరిపల్లిలో పెద్ద యూనిట్లు ఉన్నాయి. రోజుకు అర టన్ను పుట్టగొడుగుల ఉత్పత్తి జరుగుతోంది.

ప్రశ్న : ప్రజల్లో ఆరోగ్యంపై అవగాహన పెరిగి పుట్టగొడుగుల వినియోగం పెరుగుతున్న నేపథ్యంలో చిన్న యూనిట్లకు ప్రోత్సాహం ఏమైనా ఉందా?

చిన్న యూనిట్లు స్థాపించడానికి ఎవరైనా ముందుకొస్తే కచ్చితంగా లక్ష రూపాయల వరకూ సబ్సిడీ ఇవ్వడం జరుగుతోంది. ఉత్సాహం ఉన్నవారు ఎవరైనా ముందుకొస్తే మొత్తం ఖర్చు రూ.రెండున్నర లక్షలు కాగా అందులో లక్ష రూపాయల వరకూ సబ్సిడీ పొందొచ్చు.

ప్రశ్న : రైతులకు, ఔత్సాహం ఉన్న యువతకు మీరిచ్చే సలహా?

ప్రభుత్వం ఉద్యాన శాఖ ద్వారా అనేక రకాల సబ్సిడీలు, రాయితీలు అందిస్తోంది. ఈ నేపథ్యంలో రైతులు ఉద్యాన శాఖ అందించే సౌకర్యాలను అందిపుచ్చుకొని నాణ్యమైన దిగుబడి సాధించి ఆదాయం పొందాలి.

ఉత్సాహభరితంగా బాలోత్సవం

అలరించిన విదార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు



ప్రదర్శనలిస్తున్న విద్యార్థినులు

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

నూజివీడులోని శ్రీసారథి ఇంజినీరింగ్ కళాశాల ఆవరణలో నూజివీడు బాలోత్సవ కమిటీ బాలోత్సవం కార్యక్రమాన్ని ఆదివారం ఉత్సాహభరితంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న డివిజనల్ ఉప విద్యా శాఖ అధికారి ఎం.సేవ్యా నాయక్ మాట్లాడారు. 36 అంశాలను మూడు విభాగాలుగా ప్రదర్శించడం జరుగుతుందన్నారు. నియోజకవర్గ పరిధిలో 2000 మంది విద్యార్థులకుపైగా బాలోత్సవంలో పాల్గొనడం అభినందనీయమన్నారు. ఇలాంటి ఉత్సవాలు ఒత్తిడిని దూరం చేసి, చదువు పట్ల దృష్టి సారించేలా ఉపయోగపడతాయన్నారు. విద్యార్థి దశలో చదువుతోపాటు సాంస్కృతిక కార్యక్రమాలు, క్రీడల్లో ప్రతిభ కనబర్చాలన్నారు. అన్ని అంశాల్లో ప్రావీణ్యం సాధించడం ద్వారా బంగారు భవిష్యత్తుకు బాటలు వేస్తుందని తెలిపారు. అనేక రకాల తెలుగు చిత్ర సీమ పాటలు, జానపద గేయాలకు లయబద్ధంగా బాలల చేసిన నృత్యాలు ఆహూతులను అలరించాయి. అలాగే విచిత్ర వేషధారణ, క్విజ్, వ్యాసరచన పలు కార్యక్రమాల ద్వారా విద్యార్థుల్లో దాగిఉన్న సృజనాత్మక శక్తి, సాంస్కృతిక కార్యక్రమాల పట్ల ఆసక్తి ఒక్కసారిగా బహిర్గతమయ్యాయి. వేలాది మంది విద్యార్థులు, కుటుంబ సభ్యులు ఎంతో ఆనందంగా కార్యక్రమంలో పాల్గొనడం కనిపించింది. పరీక్షలకు ముందు ఇలాంటి కార్యక్రమాలు విద్యార్థులకు ఎంతగానో దోహదం చేస్తాయని పలువురు తల్లిదండ్రులు వ్యాఖ్యానించారు.

విద్యార్థులకు బహుమతులు

బాలోత్సవంలో మూడు విభాగాల్లో ప్రతిభ కనబరిచిన ముగ్గురు విద్యార్థులకు ప్రత్యేక బహుమతులు అందించారు. వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శించిన 280 విద్యార్థులను ఎంపిక చేసి బహుమతులు అందించారు. ఆగిరిపల్లి ఎంఇఒ ఆనంద్‌కుమార్, హేలాపురి బాలోత్సవ కో-ఆర్డినేటర్ గుడిపాటి నరసింహారావు, అమరావతి బాలోత్సవ కమిటీ, రామరాజు, వేలాపూరి బాలోత్సవ కోర్ కమిటీ సభ్యులు కస్తూరిబాయి, ప్రయివేట్ స్కూల్స్ అసోసియేషన్ శ్రీనివాసరావు, సారథి ఇంజనీరింగ్ కాలేజీ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ రామచంద్రరావు బహుమతులు ప్రదానం చేశారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన ముగ్గురికి మెడల్స్‌ను బాలోత్సవ కమిటీ సభ్యులు అందించారు. వివిధ ప్రదర్శనలో అలరించిన 280 మంది విద్యార్థులకు బహుమతులు అందించారు. ఈ సందర్భంగా పలువరు వక్తలు మాట్లాడుతూ సాంస్కృతిక కార్యక్రమాల్లో పిల్లలు భాగస్వాములు అయితేనే మానసిక పరిపక్వత వస్తుందన్నారు. విద్యార్థుల మానసిక వికాసానికి తోడ్పడుతున్న బాలోత్సవ కార్యక్రమాలను ఉద్యమ తరహాలో విస్తరింప చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో నూజివీడు బాలోత్సవ కమిటీ ప్రధాన కార్యదర్శి కాసాని గాంగేయుడు, ఆహ్వాన సంఘం అధ్యక్షులు బిఎల్‌జి కోటేశ్వరి, సిఐటియు నాయకులు జి.రాజు, హనుమాన్లు, యుటిఎఫ్ నాయకులు జి.వెంకటేశ్వరరావు, విద్యార్థులు, ప్రభుత్వ, ప్రయివేట్ పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.





బాలోత్సవంలో విద్యార్థులు

ఢిల్లీ రైతాంగ ఉద్యమ హామీలు అమలుచేయాలి

కేంద్ర, రాష్ట్ర బడ్జెట్‌లలో వ్యవసాయ రంగానికి నిధులు కేటాయింపు పెంచాలి
5న కలెక్టరేట్ వద్ద ధర్నా
ఎపి రైతు సంఘాల సమన్వయ సమితి జిల్లా సమావేశం

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

కేంద్ర ప్రభుత్వం ఢిల్లీ రైతాంగ ఉద్యమం సందర్భంగా రాతపూర్వకంగా ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని, కేంద్ర, రాష్ట్ర బడ్జెట్‌లలో వ్యవసాయ రంగానికి నిధులు కేటాయింపు పెంచాలని తదితర రైతాంగ సమస్యల పరిష్కారం కోసం ఈ నెల ఐదో తేదీన సంయుక్త కిసాన్ మోర్చా ఇచ్చిన దేశవ్యాప్త పిలుపులో భాగంగా జరుగుతున్న జిల్లా కలెక్టరేట్ ధర్నాను జయప్రదం చేయాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘాల సమన్వయ సమితి జిల్లా సమావేశం పిలుపునిచ్చింది. ఆదివారం ఏలూరు అన్నే భవనంలో ఆంధ్రప్రదేశ్ రైతు సంఘాల జిల్లా సమన్వయ సమితి సమావేశం ఆ సంఘం జిల్లా అధ్యక్షులు కట్టా భాస్కరరావు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశంలో ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్, బికెఎంయు జిల్లా అధ్యక్షులు బండి వెంకటేశ్వరరావు, ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పి.రామకృష్ణ, ఎఐటియుసి జిల్లా అధ్యక్షులు రెడ్డి శ్రీనివాస డాంగే, జిల్లా నాయకులు పుప్పాల కన్నబాబు తదితరులు మాట్లాడారు. ఢిల్లీ రైతాంగ ఉద్యమం సందర్భంగా మోడీ ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేయకుండా రైతాంగాన్ని మోసగించిందని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం రైతులకు క్షమాపణ చెప్పి రద్దు చేసిన మూడు వ్యవసాయ నల్ల చట్టాలకు బదులు మరింత ప్రమాదకర కొత్త చట్టాలు తీసుకొస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. అందులో భాగంగానే వ్యవసాయ మార్కెట్లను ప్రయివేటీకరించేందుకు జాతీయ వ్యవసాయ మార్కెట్ ఫ్రేమ్ వర్క్ పేరుతో కొత్త చట్టాన్ని తీసుకొస్తున్నారని, దీంతో భవిష్యత్తులో రైతులు మద్దతు ధరలు కోల్పోతారని చెప్పారు. మరోవైపు నూతన సహకార చట్టం పేరుతో సహకార సొసైటీలను, పాల డెయిరీలను, మత్స్యకార సొసైటీలను, మొత్తం సహకార వ్యవస్థను నాశనం చేసే విధానాలను రూపొందిస్తున్నారని, ఇది రైతాంగానికి అత్యంత ప్రమాదకరమన్నారు. కేంద్ర విద్యుత్ సవరణ బిల్లును యధావిధిగా అమలు చేస్తూ వ్యవసాయ పంపుసెట్లకు మీటర్లు బిగిస్తున్నారని, భవిష్యత్తులో రైతులు ఉచిత విద్యుత్ కోల్పోయే ప్రమాదం ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. రైతుల కోరుతున్న చట్టాలు కాకుండా కార్పొరేట్ కంపెనీలు కోరుతున్న చట్టాలు తీసుకురావడం దుర్మార్గమన్నారు. వ్యవసాయ కార్పొరేటీకరణ విధానాలు ఆపి కేంద్ర ప్రభుత్వం రైతాంగానికి ఇచ్చిన హామీలు అమలు చేయాలని కోరారు. మద్దతు ధరలు గ్యారెంటీ చట్టం తీసుకురావాలని డిమాండ్ చేశారు. రైతులు కష్టపడి పండించిన పంటలకు మార్కెట్‌లో కనీస ధరలు రావడంలేదని, మిర్చి, పత్తి, కొబ్బరి, కోకో, వైట్ బర్లీ పొగాకు, పెసలు, మినుములు వంటి పంటలను ప్రభుత్వ సంస్థల ద్వారా ప్రభుత్వమే కొనుగోలు చేయాలని కోరారు. ఈ నెల ఐదో తేదీన జరిగే కలెక్టరేట్ ధర్నాను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.



సమావేశంలో అభివాదం చేస్తున్న నేతలు

ట్రెజరీస్, అకౌంట్స్ అసోసియేషన్ ఎన్నిక

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

ట్రెజరీస్, అకౌంట్స్ సర్వీసెస్ అసోసియేషన్ జిల్లా సంఘ ఎన్నికలు స్థానిక జిల్లా ట్రెజరీ కార్యాలయంలో నిర్వహించారు. ఈ ఎన్నికల్లో జిల్లా అధ్యక్షుడిగా దాసరి కృష్ణంరాజు (అసిస్టెంట్ ఫైనాన్స్ ఆఫీసర్, డిసిహెచ్ఎస్, ఏలూరు), జిల్లా కార్యదర్శిగా ఇ.మహేష్‌బాబు, (సీనియర్ అకౌంటెంట్, జిల్లా ట్రెజరీ ఏలూరు), సహాధ్యక్షులుగా పి.మాధవి (ఎకౌంట్స్ ఆఫీసర్, డ్వామా, ఏలూరు) ఉపాధ్యక్షులుగా పి.ప్రేమావతి (సహాయ ఖజానాధికారి, ఏలూరు), ఎన్.శ్రీనివాసరావు (ఉప ఖజానాధికారి, భీమడోలు) ఎస్.జయలక్ష్మి,(సీనియర్ అకౌంటెంట్ జిల్లా ఖజానా కార్యాలయం ఏలూరు), కార్యనిర్వాహక కార్యదర్శిగా వై.శిరీష్ కుమార్ (సీనియర్ అకౌంటెంట్ జిల్లా ఖజానా కార్యాలయం ఏలూరు) జాయింట్ సెక్రటరీలుగా ఎస్.చినబాబు (ఉపఖ జానాధికారి, డివిజనల్ సబ్ ట్రెజరీ జంగారెడ్డిగూడెం). ఎన్.సాయికృష్ణ (జూనియర్ అకౌంటెంట్ ఉపఖజానా కార్యాలయం కైకలూరు) కె.రత్నకుమారి (సీనియర్ అకౌంటెంట్ డివిజనల్ సబ్ ట్రెజరీ ఏలూరు) ట్రెజరర్‌గా కె.నరేంద్రబాబు (సీనియర్ అకౌంటెంట్ జిల్లా ఖజానా కార్యాలయం ఏలూరు) వారు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారని ఎన్నికల అధికారి, ఎపి టాసా రాష్ట్ర ఉపాధ్యక్షురాలు షేక్ హసీనా బేగం తెలిపారు. సంఘం సభ్యుల పురోభివృద్ధికి పాటుపడుతూ త్వరలోనే అన్ని జిల్లాల ఎన్నికలు పూర్తిచేసుకుని రాష్ట్ర సంఘ ఎన్నికలకు వెళ్లామని ఈ సందర్భంగా ఎన్నికల అధికారి హసీనా బేగం తెలిపారు. జిల్లాలో సంఘ సభ్యుల అభ్యున్నతికి, వారి ఉద్యోగోన్నతులకు, వారి శ్రేయస్సుకు పాటుపడతామని నూతనంగా ఎన్నికైన అధ్యక్షులు డి.కృష్ణంరాజు, కార్యదర్శి ఇ.మహేష్ బాబు ఈ సందర్భంగా తెలిపారు. నూతనంగా ఎన్నికైన జిల్లా కార్యవర్గానికి ఎపి టాసా రాష్ట్ర అధ్యక్షులు జి.రవికుమార్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.రాజ్‌కుమార్, జిల్లాలోని యావన్మంది ట్రెజరీ, అకౌంట్స్ ఉద్యోగులు శుభాకాంక్షలు తెలిపారు.



ఎన్నికైన ట్రెజరీస్, అకౌంట్స్ సర్వీసెస్ అసోసియేషన్

స్వయం సమృద్ధిపై అవగాహన అవసరం

అదనపు ఎస్‌పి సూర్యచంద్రరావు

ప్రజాశక్తి - ఏలూరు

మహిళల రక్షణ, హక్కులు, స్వయం సమృద్ధిపై అవగాహన పెంపొందించడం ఎంతగానో అవసరమని అదనపు ఎస్‌పి ఎన్.సూర్యచంద్రరావు అన్నారు. ఎస్‌పి ప్రతాప్‌శివకిషోర్ ఆదేశాల మేరకు మహిళా దినోత్సవ వారోత్సవాలను పురస్కరించుకుని అదనపు ఎస్‌పి (అడ్మిన్) ఎన్.సూర్యచంద్రరావు ఆధ్వర్యంలో ఏలూరు మహిళా పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ ఎం.సుబ్బారావు, పోలీస్ సిబ్బంది భాగస్వామ్యంతో ఆదివారం ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. ఏలూరు అమీనాపేటలోని కళ్యాణ మండపంలో విద్యార్థులతో పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. విద్యార్థులు తమ ప్రతిభను ప్రదర్శించి మహిళా సాధికారత, లైంగిక సమానత్వం, మహిళా భద్రత వంటి ముఖ్యమైన అంశాలపై చైతన్యాన్ని పెంపొందించే నాటకాలు, పాటలు, నృత్య ప్రదర్శనలు చేశారు. ఈ సందర్భంగా అదనపు ఎస్‌పి ఎన్.సూర్యచంద్రరావు మాట్లాడుతూ సమాజంలో మహిళల రక్షణ, హక్కులు, స్వయం సమృద్ధిపై అవగాహన పెంపొందించడం ఎంతగానో అవసరమన్నారు. యువత ఈ మార్పునకు అగ్రభాగాన నిలవాలని సూచించారు. మహిళా పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ ఎం.సుబ్బారావు మహిళలకు అందుబాటులో ఉన్న రక్షణ చర్యలు, 181 హెల్ప్‌లైన్, దిశ యాప్ వంటి సేవల గురించి వివరించారు. ఈ కార్యక్రమానికి విద్యార్థులు, తల్లిదండ్రులు, పోలీసు అధికారులు, స్థానిక ప్రముఖులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేశారు.

ప్రొబేషనరీ ఎస్ఐలకు నియామక ఉత్తర్వులు

ప్రజాశక్తి - ఏలూరు

అనంతపురం పోలీస్ ట్రైనింగ్ కాలేజీలో శిక్షణ పూర్తి చేసిన ప్రొబేషనరీ ఎస్ఐలుఏలూరు రేంజ్ ఐజీ కార్యాలయంలో ఐజీ జివిజి.అశోక్‌కుమార్‌ను ఆదివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఏలూరు రేంజ్ పరిధిలో ఎంపికైన ప్రొబేషనరీ ఎస్ఐలకు నియామక ఉత్తర్వులు అందించారు. ఈ సందర్భంగా ఐజీ జివిజి.అశోక్‌కుమార్ మాట్లాడుతూ పోలీస్ శాఖలోకి కొత్తగా చేరుతున్న అధికారులకు హృదయపూర్వక అభినందనలు తెలిపారు. విధి నిర్వహణలో నిర్భయంగా, నిష్పక్షపాతంగా, క్రమశిక్షణ, నిజాయతీ, పారదర్శకత, జవాబుదారీతనం పాటిస్తూ, బాధితులకు న్యాయం, నిందితులకు శిక్షలు కల్పించేలా పని చేయాలని సూచించారు. ప్రజలకు అత్యుత్తమ సేవలందిస్తూ, పోలీస్ శాఖ ప్రతిష్టను మరింత పెంచేలా విధులను నిర్వర్తించాలని సూచించారు.

ప్రొబేషనరీ ఎస్ఐల నియామక వివరాలు

ఈసారి ఏలూరు రేంజ్ పరిధిలో వంద మంది ప్రొబేషనరీ ఎస్ఐలు (బి68బి మంది పురుషులు, బి32బి మంది మహిళలు) శిక్షణ పూర్తి చేసుకున్నారు. వీరికి ఆయా జిల్లాల్లో నియామక ఉత్తర్వులు అందించారు. ఈ కార్యక్రమంలో ఏలూరు రేంజ్ ఉన్నతాధికారులు, పోలీస్ శాఖ అధికారులు, కొత్తగా నియమితులైన ఎస్ఐలు పాల్గొన్నారు.

నూజివీడులో ఉచిత వైద్య శిబిరం

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

ఎస్‌పి కె.ప్రతాప్ శివకిషోర్ ఆదేశాల మేరకు నూజివీడు డిఎస్‌పి కెవివిఎన్‌వి.ప్రసాద్, మార్గదర్శకంలో మహిళా దినోత్సవ వారోత్సవాలను పురస్కరించుకుని ఆదివారం నూజివీడు టౌన్ పోలీస్ స్టేషన్ ఆధ్వర్యంలో ఉచిత మెడికల్ క్యాంపు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నూజివీడు టౌన్ పోలీస్ స్టేషన్ సిఐ సత్య శ్రీనివాస్ నేతృత్వంలో, మహిళలకు ప్రత్యేక వైద్య పరీక్షలు, ఆరోగ్య సూచనలు అందించారు. గైనకాలజీ, జనరల్ మెడిసిన్, శరీర బరువు నియంత్రణ, రక్తపోటు, మధుమేహ పరీక్షలు వంటి ముఖ్యమైన వైద్య సేవలను నిపుణులైన వైద్య బృందం అందించారు. ఈ సందర్భంగా సిఐ సత్య శ్రీనివాస్ మాట్లాడుతూ మహిళల ఆరోగ్యం ఒక సమృద్ధి చెందిన సమాజానికి అతి ముఖ్యమైన అంశమన్నారు. అందుకే పోలీసులు కేవలం భద్రతే కాకుండా, ఆరోగ్య పరిరక్షణలో కూడా తమ వంతు కృషి చేస్తున్నారని తెలిపారు. అలాగే మహిళలకు అందుబాటులో ఉన్న అత్యవసర సేవలు, 181 హెల్ప్‌లైన్, దిశ యాప్, మహిళా భద్రత కోసం ప్రభుత్వం తీసుకుంటున్న చర్యల గురించి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది, వైద్యులు, స్థానిక ప్రజాప్రతినిధులు, మహిళా సంఘాల ప్రతినిధులు, పెద్ద సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.

నేరాలు - ఘోరాలు

లారీని వెనుక నుంచి ఢీకొట్టిన కారు

ఐదుగురికి గాయాలు

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

లారీని కారు వెనుక నుంచి ఢీకొట్టిన ప్రమాదంలో ఐదుగురు గాయాలపాలయ్యారు. ఈ ఘటన దెందులూరు మండలం సత్యనారాయణపురం గుండేరు వాగు వద్ద ఆదివారం తెల్లవారుజామున చోటు చేసుకుంది. దెందులూరు ఎస్ఐ శివాజీ తెలిపిన వివరాల ప్రకారం... రాజమండ్రి ఆర్‌టిసి కాంప్లెక్స్ సమీపంలో నివాసం ఉంటున్న కుటుంబ సభ్యులు ఐదుగురు తమ సొంత కారులో పిడుగురాళ్ల గ్రామంలో వివాహానికి వెళ్లారు. తిరిగి కారులో స్వగ్రామానికి బయలుదేరారు. ఈ క్రమంలో ఆదివారం తెల్లవారుజామున జాతీయ రహదారిపై దెందులూరు మండలం సత్యనారాయణపురం గుండేరు వాగు వద్దకు వచ్చేసరికి ముందుగా వెళ్తున్న లారీని ఓవర్ టేక్ చేసే క్రమంలో కారు వెనుక నుంచి ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో ఊట్ల రామకృష్ణ, అతని భార్య అరుణ, అతని అమ్మమ్మ అనంతలక్ష్మి, అరుణ నానమ్మ సామ్రాజ్యం, కారులో ఉన్న ఇరుసుమల్లి మణికంఠలు ఐదుగురు గాయాలపాలయ్యారు. సమాచారం అందుకున్న దెందులూరు ఎఎస్ఐ వెంకటేశ్వరరావు, హైవే పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని గాయాలపాలైనవారిని 108 అంబులెన్స్‌లో ఆశ్రం వైద్యశాలకు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ శివాజీ తెలిపారు.

అదుపుతప్పి ఆటో బోల్తా

డ్రైవర్ మృతి

ప్రజాశక్తి - ఆగిరిపల్లి

ఆటో అదుపు తప్పి ఆటోడ్రైవర్ అక్కడికక్కడే దుర్మరణం పాలైన సంఘటన ఆదివారం మండల పరిధిలోని అమ్మవారిగూడెం సమీపంలో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... ఆగిరిపల్లి ఎస్‌సి ఏరియాకు చెందిన కూరపాటి నాని(31) ఆటోడ్రైవర్‌గా పని చేస్తున్నాడు. ఆదివారం ఆగిరిపల్లి నుంచి అమ్మవారిగూడెం వెళ్లే క్రమంలో మార్గమధ్యంలో ఆటో అదుపుతప్పి బోల్తా కొట్టడంతో కూరపాటి నాని అక్కడికక్కడే మృతి చెందాడు. మృతునికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. రెక్కాడితే గాని డొక్కాడని పేద కుటుంబం కావడంతో కుటుంబ యజమాని చనిపోవడంతో ఆ కుటుంబ పరిస్థితి ఆగమ్యగోచరంగా తయారైంది. నాని మృతితో ఎస్‌సి ఏరియాలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

గుర్తు తెలీని వాహనం ఢీకొని వ్యక్తి మృతి

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

గుర్తు తెలీని వాహనం ఢీకొని వ్యక్తి మృతి చెందిన ఘటన మండలంలోని గొల్లపల్లి గ్రామంలో శనివారం రాత్రి చోటు చేసుకుంది. గొల్లపల్లి గ్రామానికి చెందిన వ్యక్తి కూరాటి శ్యాంబాబు (46) శనివారం రాత్రి రోడ్డుపై నడుచుకుంటూ వెళుతుండగా గుర్తు తెలీని వాహనం ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్ర గాయాలపాలైన శ్యాంబాబు అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించి వివరాలు సేకరించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నూజివీడు ఏరియా ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మృతునికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

కోడిపందేల స్థావరంపై దాడి

నలుగురిపై కేసు

ప్రజాశక్తి - టి.నరసాపురం

అప్పలరాజుగూడెం గ్రామ శివార్లలో కోడిపందేల స్థావరంపై దాడి చేసిన పోలీసులు నలుగురిని అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి నగదు, కోడిపుంజు, కోడి కత్తి స్వాధీనం చేసుకున్నారు. హెడ్ కానిస్టేబుల్ ఎం.రాజు తెలిపిన వివరాల ప్రకారం.. కోడి పందేలు ఆడుతున్నారన్న సమాచారం మేరకు మండలంలోని అప్పలరాజుగూడెం గ్రామ శివార్లలో పోలీసులు ఆదివారం దాడి చేశారు. ఈ దాడిలో కోడిపందేలు ఆడుతున్న నలుగురిని అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రూ.2100 నగదు, కోడి పుంజు, కోడి కత్తి స్వాధీనం చేసుకుని నలుగురు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు హెడ్ కానిస్టేబుల్ తెలిపారు.

అధికారుల లోపమా.. పాలకుల నిర్లక్ష్యమా?

బలివే ఘటనలో తప్పెవరిది?

ఇసుక తవ్వకాల వల్లే ప్రమాదాలు

తమ్మిలేరులో నీరు నింపే ముందు గోతులు సరిచేయాలి

ప్రజాశక్తి - ముసునూరు

మహాశివరాత్రిని పురస్కరించుకుని బలివే గ్రామంలో ఉన్న శ్రీ రామలింగేశ్వర స్వామి కళ్యాణ ఉత్సవాలు ఏర్పాట్ల సందర్భంగా యాత్రికులు తమ్మిలేరులో స్నానాలు చేసేందుకు పోలవరం ప్రాజెక్టు నీళ్ల వదులుతారు. ఆ తమ్మిలేరులో స్నానం చేస్తుండగా ఇసుక పొరల్లో కూరుకుపోయి యాత్రికులు మృతి చెందుతున్న ఘటనలు ప్రతి ఏడాది చోటు చేసుకుంటున్నాయి. ఈ ఘటనలకు ఎవరు బాధ్యులని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. అధికారుల పర్యవేక్షణ లోపమా..?, పాలకుల నిర్లక్ష్యమా అని పలు విమర్శలు వ్యక్తం చేస్తున్నారు.



తమ్మిలేరులో పుష్కలంగా ఉన్న నీరు

ఉత్సవాల సందర్భంగా తమ్మిలేరులో స్నానం చేసిన అనంతరం స్వామివారిని దర్శించుకోవడం అనేది 1956 సంవత్సరం నుంచి ఉన్న ఆనవాయితీ అని ఆలయ అధికారులు చెబుతున్నారు. మహాశివరాత్రి ఉత్సవాల ఏర్పాట్లను దేవాదాయ, ధర్మాదాయ శాఖాధికారులు, ఇరిగేషన్ శాఖాధికారులు, ఉత్సవ కమిటీ సభ్యులు, మండల, డివిజన్, జిల్లా స్థాయి అధికారులందరూ పర్యవేక్షణలో జరుగుతాయి. అయినా ప్రమాదాలు చోటు చేసుకుని మరణాలు సంభవించడంతో ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతేడాది 2024 ఫిబ్రవరి నెలలో నిర్వహించిన బలివే శివరాత్రి కళ్యాణ మహోత్సవాల్లో ఏలూరు పట్టణానికి చెందిన యువకుడు స్నానం చేసేందుకు తమ్మిలేరులో దిగి మృతి చెందాడు. ఈ ఏడాది గత ఫిబ్రవరిలో నిర్వహించిన శివరాత్రి ఉత్సవాల్లో కూడా తమ్మిలేరులో స్నానాలు చేసేందుకు దిగి వ్యక్తి మృతి చెందాడు. బలివే ఉత్సవాలకు వచ్చిన సోదరులు పెదవేగి మండలం నడిమిల్లి వద్ద తమ్మిలేరులో స్నానానికి దిగి మృతి చెందారు. ఈ మరణాలకు బాధ్యులు ఎవరని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. తమ్మిలేరులో ఇసుకను తవ్వేసి తరలించడంతో గోతులు ఏర్పడి ఆ గోతుల్లో పడి యాత్రికులు మృతి చెందుతున్నారని చెబుతున్నారు. పూర్వం ఆ ప్రదేశంలో ఇసుక తోలకాలకు అనుమతులు ఉండేవి కావని, దీంతో అప్పుడు ఇలాంటివి ఘనటలు చోటు చేసుకునేవి కావని మండలంలోని పెద్దలు చెబుతున్నారు. అంతేకాకుండా ఆ ప్రదేశంలో వంతెన నిర్మాణం చేపట్టిన సమయంలో అందుకు అవసరమైన ఇసుకను తమ్మిలేరులో తవ్వేసి తరలించారు. దీంతో గోతులు ఏర్పడ్డాయి. మహాశివరాత్రి ఉత్సవాల సందర్భంగా నీరు వదిలినప్పుడు స్నానానికి దిగిన యాత్రికులు ఆ గోతుల కారణంగా మృతి చెందుతున్నారని ప్రజలు చెబుతున్నారు. ఇకనుంచి ప్రతి ఏడాది కల్యాణోత్సవాలు జరిగే సమయానికి ముందే తమ్మిలేరుకు నీరు వదిలే ముందే గోతులు లేకుండా సరిచేయాల్సిన అవసరం ఏంతైనా ఉంది. ఈ ప్రమాద ఘటనపై ఆలయ కార్య నిర్వహణాధికారి పామర్తి సీతారామయ్యను వివరణ కోరగా తాము ఆలయంలో మూడు రోజులు జరిగే ఉత్సవాల ఏర్పాట్లు, లక్షకు పైగా వచ్చే యాత్రికులకు దర్శనమయ్యేలా ఏర్పాట్లు చూస్తున్నామన్నారు. ఉన్నతాధికారులు ఆ తమ్మిలేరు పరిసర ప్రాంతాలను పరిశీలించి ఇలాంటి ఘటనలు చోటు చేసుకోకుండా చర్యలు తీసుకోవాలి.

మృతుల కుటుంబాలకు నష్ట పరిహారం అందించాలి

సిపిఎం మండల కార్యదర్శి కొడవలి శ్రీనివాస్

బలివే ఉత్సవాలకు ఎంతో ఆనందంగా వచ్చిన కుటుంబంలో ఇలాంటి ఘటన చోటు చేసుకుంటే బాధ వర్ణనాతీతంగా ఉంటుంది. ఇలాంటి ఘటనటు చోటు చేసుకోకుండా అధికారులు తగిన చర్యలు తీసుకోవాలి. రాష్ట్ర ప్రభుత్వం కూడా స్పందించి ఆ మరణించిన కుటుంబాలవారికి నష్టపరిహారం అందించాలి.

అభయ రక్షక దళ సభ్యుల గస్తీ

పలు అంశాలపై ప్రజలకు, విద్యార్థులకు అవగాహన

ప్రజాశక్తి - ఏలూరు

ఎస్‌పి ప్రతాప్ శివ కిషోర్ ఆదేశాల మేరకు ఏలూరు మహిళా పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ ఎం.సుబ్బారావు సిబ్బందితో మహిళలు, బాలికలు, వృద్ధుల రక్షణ కోసం అభయ రక్షక దళం జిల్లా వ్యాప్తంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తోంది. అభయ రక్షక దళ సభ్యులు గస్తీ నిర్వహిస్తూ, సైబర్ నేరాలు, మహిళలపై వేధింపులు, ఇతర భద్రతా సమస్యలపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. అభయ వాహనం ద్వారా సైబర్ నేరాలు, సోషల్ మీడియా మోసాలు, మహిళా భద్రత, ఆత్మ రక్షణ పద్ధతులపై దృశ్య రూపక అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. మహిళలు, బాలికలు భద్రతా సమాచారం పొంది, అజాగ్రత్తగా ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచిస్తున్నారు. సమాజంలో మహిళలపై నేరాలు తగ్గించడం, భద్రతా చైతన్యం పెంపొందిస్తున్నారు. అత్యవసర పరిస్థితుల్లో సహాయం కోసం టోల్ ఫ్రీ నెంబర్లు 112, సైబర్ నేరాలకు సంబంధించి 1930, బాల్య వివాహాలకు సంబంధించి 1098, అసాంఘిక కార్యకలాపాలపై జిల్లా వాట్సాప్ నెంబర్ 9550351100 ఫిర్యాదు చేయాలని తెలిపారు. అత్యవసర సమయాల్లో బాలికలు, మహిళలు, వృద్ధులు సంరక్షణ కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన టోల్ ఫ్రీ నెంబర్ గురించి అవగాహన కార్యక్రమాలను జిల్లాలో ఉన్న అన్ని జెడ్‌పి హైస్కూల్లో, జిల్లా వ్యాప్తంగా అన్ని పోలీస్ స్టేషన్ పరిధిలో అభయ పెట్రోలింగ్, బిసి వెల్ఫేర్ హాస్టల్లో ఓపెనింగ్ ఏరియాస్‌లో తిరిగి మహిళల సంరక్షణ కోసం జిల్లా పోలీస్ యంత్రాంగం నిర్వహిస్తున్న అవగాహన కార్యక్రమాల గురించి ప్రజలకు, విద్యార్థులకు వివరించారు.



అవగాహన కల్పిస్తున్న అభయ రక్షక దళ సభ్యులు

ప్లాస్టిక్ వినియోగంపై పూర్తిస్థాయి నిషేధం

ప్రజాశక్తి - భీమడోలు

పొలసానిపల్లి గ్రామపంచాయతీ పరిధిలో ప్లాస్టిక్ వినియోగంపై పూర్తిస్థాయి నిషేధం అమలు చేస్తున్నట్లు గ్రామ సర్పంచి షేక్ రహీమా బేగం హసేన తెలిపారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు గ్రామంలో రెండు రోజులపాటు అమలు చేయనున్న శానిటేషన్ స్పెషల్ డ్రైవ్ కార్యక్రమంలో భాగంగా రెండో రోజైన ఆదివారం గ్రామ సర్పంచి పర్యవేక్షణలో గ్రామపంచాయతీ కార్యదర్శి రామకృష్ణ, పంచాయతీ సిబ్బంది సహకారంతో ఆదివారం షాపులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అమ్మకాలకు, వినియోగానికి సిద్ధం చేసిన ప్లాస్టిక్ తయారీలను స్వాధీనం చేసుకున్నారు. ప్లాస్టిక్ వినియోగించొద్దని షాపుల వారికి హెచ్చరికలు జారీ చేశారు. అనంతరం వారికి అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం గ్రామ సర్పంచి మాట్లాడుతూ పంచాయతీ పరిధిలోనిచెత్త నుంచి సంపద తయారీ కేంద్రం పనితీరు మెరుగుపరిచే క్రమంలో గ్రామపంచాయతీ సహకారంతో పలు కార్యక్రమాలు చేపట్టామన్నారు. ఇదే విధంగా తడి, పొడి చెత్తలు వేరు చేసి తమ వద్దకు వచ్చే పంచాయతీ సిబ్బందికి అందజేయాలని కోరామన్నారు. దీనికోసం వారికి చెత్త సేకరణకు అవసరమైన సామగ్రిని ఇంటింటికి అందించినట్లు తెలిపారు. చెత్త నుంచి సంపద తయారీ కేంద్రం వద్ద పంచాయతీకి అదనపు ఆదాయ వనరుగా వర్మీ కంపోస్ట్ ఎరువుల తయారీకి చర్యలు తీసుకున్నట్లు తెలిపారు.



చెత్త నుంచి సంపద తయారీ కేంద్రం వద్ద ఏర్పాట్లను పరిశీలిస్తున్న గ్రామపంచాయతీ కార్యదర్శి, సర్పంచి

లయన్స్ అంతర్జాతీయ సంస్థ సేవలు ఆదర్శనీయం

రీజియన్ చైర్‌పర్సన్ ఎం.కృష్ణమోహన్

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

లయన్స్ జిల్లా 316జి రీజియన్ 1 సేవా మాధుర్యం రీజియన్ సమావేశం ఏలూరులోని న్యూ అశోక్ నగర్‌లోని కాకరాల కృష్ణమూర్తి అన్నపూర్ణమ్మ, లైయన్స్ మల్టీ సర్వీసెస్ సెంటర్లలో ఆదివారం లయన్స్ రీజియన్ చైర్‌పర్సన్ ఎం.కృష్ణమోహన్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వ్యాఖ్యాతగా మద్దుకూరి శ్రీహరి వ్యవహరించారు. ఈ సందర్భంగా కృష్ణమోహన్ మాట్లాడుతూ పేద ప్రజల అభ్యున్నతికి లయన్స్ అంతర్జాతీయ సంస్థ చేస్తున్న సేవలు ఆదర్శనీయమన్నారు. లయన్స్ క్లబ్బులు ప్రముఖంగా మానవ సేవగా భావిస్తూ సమాజానికి ఉపయోగపడే అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తుందని అన్నారు. ఈ సందర్భంగా సేవా మహోత్సవం నిర్వహించి పేద ప్రజలకు కుట్టు మిషన్లు, గ్రైండర్లు, విద్యార్థులకు సైకిళ్లు అందించారు. ఈ సేవా మహోత్సవాన్ని లయన్స్ క్లబ్ జిల్లా గవర్నర్ కాకరాల వేణుబాబు ప్రారంభించారు. అనంతరం వేణుబాబు మాట్లాడుతూ కృష్ణమోహన్ విభిన్న తరహాలో వినూత్న సేవా భావజాలంతో పేద ప్రజలకు సేవలు అందించడం హర్షించదగ్గ విషయమన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా లయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ ఫౌండేషన్ ఏరియా లీడర్ డాక్టర్ అంబటి సుధాకర్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా సుధాకర్ రెడ్డి మాట్లాడుతూ లయన్ అంతర్జాతీయ సంస్థ సమాజంలో జరిగే మార్పులకు అనుకూలంగా ఆధునిక సమాజానికి ఉపయోగపడే సేవా కార్యక్రమాలైన కేన్సర్, డయాబెటిస్, పర్యావరణం, యువతను సరైన మార్గంలో నడిపించడం, కంటి పరిరక్షణ, ఆకలి నివారణ, డయాలసిస్ సెంటర్లను స్థాపించడం వంటి ఎన్నో సేవా కార్యక్రమాలను నిర్వహిస్తూ సమ సమాజ నిర్మాణంలో తమ వంతు పాత్ర పోషిస్తుందని, అందుకు సహకరిస్తున్న దాతలు, లయన్స్ క్లబ్ మెంబర్లు అందరు అభినందనీయులన్నారు. ఈ సందర్భంగా లయన్ ఆఫ్ ది రీజియన్ అవార్డుతో లీల వెంకటేశ్వరరావును సత్కరించారు. అదేవిధంగా మోస్ట్ ఇన్వాల్వ్ లయన్ అవార్డుతో ఎం.శ్రీహరిని అభినందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రథమ వైస్ గవర్నర్ పాపారావు నాయుడు, ద్వితీయ వైస్ గవర్నర్ డాక్టర్ డి.సుబ్బారావు, వికే పంకజక్షన్, పూర్వపు జిల్లా గవర్నర్ వేమ కోటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.



లీల వెంకటేశ్వరరావును సత్కరిస్తున్న ప్రముఖులు

పర్యావరణ పరిరక్షణకు వినూత్న ప్రయత్నం

ప్రజాశక్తి - భీమడోలు

మనల్ని మనం మార్చుకోవటం ద్వారా ఆరోగ్యవంతమైన, ఆదర్శప్రాయమైన ఆంధ్రప్రదేశ్‌ను ఏర్పాటు చేయగలమనే అంశంపై రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన పిలుపును భీమడోలు గ్రామపంచాయతీ వినూత్న రీతిలో ప్రచారం చేస్తుంది. దీనిలో భాగంగా నటులు చిరంజీవి నటించిన ఒక సినిమాలోని అంశాన్ని వేరొక రూపంలో అమలు చేసేందుకు గ్రామపంచాయతీ కార్యదర్శి తనూజ తన వంతు ప్రయత్నం చేస్తున్నారు. ఆ సినిమాలో సినీ నటులు తన సహాయం పొందిన ఇతరులను కేవలం తనకు ధన్యవాదాలు తెలపడంతో సరిపెట్టవద్దని, ఇబ్బందుల్లో ఉన్న మరొక ముగ్గురికి సహాయం ద్వారా ఆ రూపంలో ధన్యవాదాలు తెలుపవచ్చని సూచిస్తారు. అదేవిధంగా భీమడోలు గ్రామపంచాయతీ ఆరోగ్యవంతమైన ఆంధ్రప్రదేశ్ తయారీ కోసం ప్రభుత్వం పర్యావరణ పరిరక్షణ, పారిశుధ్య కార్యక్రమాల అమలు, సామాజిక బాధ్యతలు ఇతర మరొక 13 అంశాలతో కూడిన సందేశాన్ని గ్రామస్తులకు సంక్షిప్త సమాచారం రూపంలో వాట్సాప్ మెసేజ్‌ల ద్వారా తెలిపారు. దీనిని వారు తమకు తెలిసిన మరొక ఐదుగురికి సదరు వాట్సాప్ సందేశాలను పంపాలని కోరారు. ఈ విధంగా చేయడం ద్వారా కొంతకాలానికి ప్రభుత్వం ఆశించిన ఫలితం వస్తుందని గ్రామపంచాయతీ కార్యదర్శి తెలిపారు. వినూత్నంగా చేపట్టిన ఈ కార్యక్రమం పలువురిని ఆకట్టుకుంటుంది.

సత్యనారాయణమూర్తి అరెస్టు ప్రజాస్వామ్యానికి గొడ్డలి పెట్టు

సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ప్రభాకర్

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

ఎల్‌జి పాలిమర్స్ పేలుడు సందర్భంగా సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జెవి.సత్యనారాయణమూర్తి ఆధ్వర్యంలో సిపిఐ శ్రేణులు ఆందోళన చేసిన సందర్భంలో పెట్టిన కేసులో కోర్టుకు హాజరు కాలేదన్న కారణంతో సత్యనారాయణమూర్తిని పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు పంపటం ప్రజాస్వామ్యానికి గొడ్డలి పెట్టు అని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు డేగా ప్రభాకర్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం పనిచేస్తున్న కమ్యూనిస్టు నాయకులను నేరస్తుడి మాదిరిగా అరెస్టు చేయడం దుర్మార్గమని పేర్కొన్నారు. అరెస్టు తీరు సక్రమమైన పద్ధతిలో లేదని తెలిపారు. పోలీసులు ఇటువంటి దుర్మార్గపు చర్యలకు పూనుకోవడం సరైన చర్య కాదని పేర్కొన్నారు. గత వైసిపి పాలనలో ఇటువంటి అక్రమ కేసులు బనాయించిన కారణంగానే ప్రజలు వైసిపి ప్రభుత్వాన్ని ఇంటికి సాగనంపారని తెలిపారు. కూటమి ప్రభుత్వం కూడా కక్ష సాధింపు చర్యలు చేపడితే వైసిపికి పట్టిన గతే పడుతుందని పేర్కొన్నారు. తాము అధికారంలోకి వస్తే వైసిపి ప్రభుత్వం అక్రమంగా పెట్టిన కేసులన్నీ రద్దు చేస్తామని ఇచ్చిన హామీని కూటమి ప్రభుత్వం నిలబెట్టుకోవాలని తెలిపారు. అక్రమంగా అరెస్టు చేసిన సత్యనారాయణ మూర్తిని బేషరతుగా విడుదల చేయాలని పేర్కొన్నారు.

ముమ్మరంగా మినుము తీతలు

ప్రజాశక్తి - ముదినేపల్లి

మండలంలో మినుము తీత పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. రైతులు కూలీల చేత మినుము తీతలు తీయిస్తున్నారు. మండలంలో దాళ్వా రద్దు కావడంతో రైతాంగం మండల వ్యాప్తంగా అధిక సంఖ్యలో మినుము పైరు సాగు చేశారు. పంట చేతికి రావడంతో రైతులు మినుము తీతలు ప్రారంభించారు. ప్రస్తుతం మండల వ్యాప్తంగా అన్ని గ్రామాల్లో మినుము తీతలు ముమ్మరంగా సాగుతున్నాయి. దీంతో గ్రామాలన్నీ పనులకు వెళ్లే కూలీలతో సందడిగా మారింది. ఉదయం నుంచి సాయంత్రం వరకు పని చేసే పురుష కూలీలకు రూ.550 చొప్పున, మహిళా కూలీకి రూ.500 చొప్పున రైతులు కూలీ ఇస్తున్నారు. మధ్యాహ్నం వరకు అయితే ఒక మనిషికి రూ.300 చొప్పున కూలి ఇస్తున్నారు. ఇకపోతే దిగుబడులు ఏమేరకు వస్తాయోనని రైతులు ఆశతో ఉన్నారు.



మినుము తీత తీస్తున్న కూలీలు

ఆర్యవైశ్యుల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం పెద్దపీట

ఆర్యవైశ్య మహాసభ జిల్లా ఉపాధ్యక్షులు గుబ్బా రాంబాబు

ప్రజాశక్తి - పోలవరం

రాష్ట్ర బడ్జెట్‌లో ఆర్యవైశ్య సంక్షేమ కార్పొరేషన్‌కు రూ.515.95 కోట్ల నిధులు కేటాయించడంతో ఆర్థికంగా వెనకబడిన ఆర్యవైశ్యుల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం పెద్దపీట వేసిందని, ఈ నేపథ్యంలో సిఎం చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్, రాష్ట్ర బిసి వెల్ఫేర్ శాఖ మంత్రి సవితమ్మకు ప్రపంచ ఆర్యవైశ్య మహాసభ జిల్లా ఉపాధ్యక్షులు గుబ్బా రాంబాబు ఆదివారం ఒక ప్రకటనలో కృతజ్ఞతలు తెలిపారు. గత ప్రభుత్వం కార్పొరేషన్ల పేరుతో పదవులు కోసం కేటాయించినట్లు పేర్కొన్నారు. దానికి బడ్జెట్లో నిధులు కేటాయింపులు ఏమీ కేటాయించలేదని, అభివృద్ధికి నోచుకోలేదని, ఇది అందరికీ తెలిసిన విషయమేనని తెలిపారు. అయితే ఇప్పుడున్న కూటమి ప్రభుత్వం ఆ విధంగా కాకుండా ఆర్థికంగా వెనుకబడిన వారందరికీ కార్పొరేషన్ ద్వారా నిధులు కేటాయించి వారిని ఆదుకోవడం జరుగుతుందని తెలిపారు. ఈ నిధుల ద్వారా ఆర్యవైశ్యుల్లో ఆర్థికంగా వెనుకబడిన వారు లబ్ధి పొందుతారని పేర్కొన్నారు.

ఘనంగా ఎఫ్‌సిఐ వార్షికోత్సవ వేడుకలు

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

ఫస్ట్ క్రై ఇంటెలిటోట్స్ స్కూల్ మొదటి వార్షికోత్సవ వేడుకలు ఏలూరులోని అగ్రహారంలో ఉన్న విటిఆర్ గ్రాండ్ కళ్యాణ మండపంలో శనివారం ఘనంగా నిర్వహించారు. ముందుగా విద్యార్థులు అనేక సాంస్కృతిక కార్యక్రమాలతో అలరించారు. ఈ సందర్భంగా స్కూల్ ప్రిన్సిపల్ శ్రావణి మాట్లాడుతూ ఏలూరులో ఉన్న కిడ్స్ స్కూల్లో ఫస్ట్ క్రై ఇంటెలిటాట్స్ నెంబర్ వన్ ప్లేస్‌లో ఉందని చెప్పుకోవడానికి ఎంతో గర్వపడుతున్నానన్నారు. తమ స్కూల్లో క్రమశిక్షణ, ఎంకరేజ్‌మెంట్, సాంస్కృతిక కార్యక్రమాలు, మంచి అలవాట్లు, విద్యార్థుల్లో స్నేహభావం, సమానత్వం వంటి ఎన్నో విషయాలను పిల్లలకు నేర్పడం జరుగుతుందని తెలిపారు. తమ వద్ద పనిచేస్తున్న టీచర్స్ పిల్లలు ఎంత విసిగించిన ఎంతో సహనంతో వారిని చూసుకుంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్కూల్ కరస్పాండెంట్ జగదీష్, టీచర్స్, విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రాష్ట్రాభివృద్ధికి కూటమి ప్రభుత్వం ప్రాధాన్యం

టిడిపి నియోజకవర్గ కన్వీనర్ నరసింహారావు

ప్రజాశక్తి - ముదినేపల్లి



కూటమి ప్రభుత్వం సంక్షేమం, అభివృద్ధికి బడ్జెట్ కేటాయింపుల్లో ప్రాధాన్యం ఇస్తుందని టిడిపి నియోజకవర్గ కన్వీనర్ వీరమల్లు నరసింహారావు అన్నారు. ఆదివారం సాయంత్రం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ ప్రధానంగా అధికారంలోకొచ్చేందుకు దోహదపడ్డ సూపర్ సిక్స్ పథకాలకు ఈ బడ్జెట్‌లో కేటాయింపులు చేయడం అభినందనీయమన్నారు. ఈ బడ్జెట్ సామాజిక సంక్షేమ పథకాలు, విద్య, ఆర్థిక వ్యవస్థ, సాంకేతిక, నైపుణ్యాభివృద్ధిపై దృష్టి సారించిందన్నారు. రాష్ట్రంలో బడ్జెట్ కేటాయింపులు చూస్తే ముందుగా పాఠశాల విద్య ఇంకా అభివృద్ధి కోసం రూ.31,806 కోట్లు కేటాయించిందన్నారు. పారిశ్రామిక అభివృద్ధి ఇంకా నైపుణ్యాభివృద్ధి కోసం రూ.12,112 కోట్లు కేటాయించారని, సామాజిక సమ్మిళితత్వం, సాధికారత కోసం రూ.1,42,349 కోట్లు, స్థిరమైన వ్యవసాయ పద్ధతులను ప్రోత్సహించడానికి రూ.29,655 కోట్లు కేటాయించారన్నారు. ప్రజా రాజధాని అమరావతి నిర్మాణం కోసం రూ.6,000 కోట్లను కేటాయిస్తున్నట్లు ఆర్థిక మంత్రి వెల్లడించారన్నారు. రైతులకు ఎన్నికల సమయంలో అందించిన హామీ ప్రకారం అన్నదాత సుఖీభవ పథకానికి రూ.6,300 కోట్లను కేటాయించినట్లు తెలిపారు. ఎపికి జీవనాడి అయిన పోలవరం ప్రాజెక్టు పనులను పూర్తి చేయటానికి రాష్ట్ర ప్రభుత్వం రూ.6,705 కోట్లను కేటాయించిందన్నారు. సూపర్ సిక్స్ హామీల్లో ఒకటైన తల్లికి వందనం కోసం రూ.9,407 కోట్లను ప్రభుత్వం కేటాయించినట్లు, దీని ద్వారా స్కూలుకు వెళ్లే ప్రతి విద్యార్థికి ఏటా రూ.15వేలు ఆర్థిక సహాయం అందించటానికి మంత్రి లోకేష్ చెప్పినట్లుగానే నిధుల కేటాయింపు జరిగిందని తెలిపారు.

శ్రీ విఘ్నేశ్వర వికలాంగుల సేవా సమితి సేవలు అభినందనీయం

66 మందికి నెల వారి రేషన్ పంపిణీ

ప్రజాశక్తి - భీమడోలు

గుండుగొలను కేంద్రంగా వికలాంగులకు దాతల సహకారంతో నెలవారీ రేషన్ పంపిణీ, ఇతర సౌకర్యాలు కల్పిస్తున్న శ్రీ విఘ్నేశ్వర వికలాంగుల సేవా సమితి సేవలు అభినందనీయమని పలువురు వక్తలు పేర్కొన్నారు. సేవా సమితి కార్యాలయంలో ఆదివారం గ్రామపంచాయతీ పరిధిలోని 66 మంది వికలాంగులకు నెల వారి రేషన్ పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. దీనిలో భాగంగా వికలాంగులకు సన్న బియ్యం, పండ్లు, పౌష్టికాహారాన్ని దాతలు నంబూరి సుబ్బరాజు, అనసూయమ్మ, హరినాథ రాజు సమకూర్చారు. ఇదేవిధంగా వీరందరికీ భోజన సౌకర్యాన్ని చల్లా నరసింహమూర్తి జ్ఞాపకార్థం వారి కుమార్తెలు సరస్వతి, రాధ, రజిత ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సేవా సమితి నిర్వాహకులు పేరిచర్ల శ్యామలరాజు, ఎ.సోములు, జి.శ్రీనివాసరావు మాట్లాడుతూ సేవా సమితి ద్వారా వికలాంగులకు రేషన్ అందించడంతో పాటు వారి ఆరోగ్య పరిరక్షణకు సేవా దృక్పథం గల ప్రముఖ వైద్యుల సహకారంతో ఉచిత వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నారని తెలిపారు.